క్లుప్తంగా

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

చేబ్రోలు: చేబ్రోలులోని గ్రామ సచివాలయం-1 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

దుకాణంలో చోరీ

మంగళగిరి: నగరంలోని సీకే ఉన్నత పాఠశాల ఎదుట గల శ్రీ హనుమాన్ సాల్ట్ జనరల్ స్టోర్‌లో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి దుకాణంలోని రూ.లక్ష నగదును దోచుకెళ్లినట్లు యజమాని ఎం పూర్ణచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పట్టణ ఎస్ఐ మహేంద్ర తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకుని క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ యజమానిపై దాడి

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం శర్మ దాబా హోటల్ యజమానిపై పలువురు దాడికి పాల్పడ్డారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... శర్మ దాబా యజమాని సచిన్ శర్మపై నవులూరుకు చెందిన ఓ హత్య కేసులో ప్రధాన నిందితుడు తోట పానకాలు, ఏసు, శ్రీను, గోపిలతోపాటు మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి యర్రబాలెం స్పెన్సర్ సెంటర్‌లోని శర్మ దాబాకు వచ్చి యజమాని సచిన్ శర్మపై దాడికి పాల్పడగా తలకు గాయమైంది. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

మంగళగిరి: నగర పరిధిలోని కురగల్లులో అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపారు. కురగల్లుకు చెందిన కె శివశంకరరావు తన నివాసంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు శుక్రవారం ఆకస్మిక దాడి నిర్వహించి 34 క్వార్టర్ సీసాలు, 3 ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడు శివశంకరావును అదుపులోకి తీసుకుని విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

26 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు కోకోకోలా సమీపంలో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీని మంగళగిరి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రూరల్ ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేలు నుంచి కాకినాడ పోర్టుకు సుమారు 26 టన్నులు (545 బస్తాలు) రేషన్ బియ్యం లోడుతో తరలి వెళుతున్న లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్ ఎస్‌కే చాంద్‌బాషా, క్లీనర్ పెరుమాళ్ల చినరాయుడును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. రేషన్ బియ్యం లారీ పట్టుబడకుండా తప్పించుకునేందుకు అక్రమ రవాణాదారులు కొత్త ఎత్తుగడ వేశారు. వాస్తవానికి కడప జిల్లా బద్వేలు నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లే దారి నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ మీదుగా రావాల్సి ఉంది. టోల్‌గేట్ వద్ద పోలీసుల తనిఖీలతోపాటు టోల్‌గేట్‌ను తప్పించుకునేందుకు లారీని గుంటూరు నుంచి నంబూరు మీదుగా దుగ్గిరాల-మంగళగిరి రోడ్డు మీదుగా జాతీయ రహదారికి చేరుకునేందుకు యత్నించగా సమాచారం అందుకున్న పోలీసులు ఆత్మకూరు కోకోకోలా కంపెనీ వద్ద లారీని స్వాధీనం చేసుకున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు



గుంటూరు ఈస్ట్: హత్య కేసులో నిందితుడ్ని అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసుల స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ రామానాయక్ వివరాలు వెల్లడించారు. ఈనెల 11వ తేదీ అమరావతి రోడ్డులోని ఓ టీస్టాల్ వద్ద జి.రవి కూర్చుని ఉన్నాడు. ఈ సమయంలో కుంచాల బాజీ అక్కడకు వచ్చి కూలి పనులకు సంబంధించి డబ్బుల పంపిణీ విషయంలో అతడితో గొడవ పడ్డాడు. బాజీ రాయితో రవి తలపై మోదడంతో స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడు బాజీని అరెస్టు చేశారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి మే 10న జరగనున్న ఏపీ పాలిసెట్-2023కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఈనెల 19 నుంచి మే ఆరో తేదీ వరకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఉచిత శిక్షణ తరగతుల్లో పాల్గొనే ఆసక్తి గల విద్యార్థులు అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాల కార్యాలయంలో నేరుగా సంప్రదించాలని ఆయన సూచించారు. వివరాలకు 83329 11155, 93907 87574 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



రక్తదాన శిబిరంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత, దయాసాగర్



లాంఫాంలో.. అంబేడ్కర్‌కు ఘన నివాళి



పెదకాకాని.. మండల పరిషత్ కార్యాలయంలో..



పెదకాకాని సెంటర్‌లో నినాదాలు చేస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు



చెరువులోపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి..



ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళి..



సివిల్ సర్వీస్ పుస్తకాలను అందజేస్తున్న ఎలీషా



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి, మాట్లాడుతున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము తదితరులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే వెంకట రోశయ్య
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు
- వాడ వాడలా అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుచరిత



పొన్నూరు ఐలాండ్ సెంటర్‌లో అంబేడ్కర్‌కు నివాళి అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రోశయ్య

గుంటూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మాజీ ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్‌తో కలిసి ఘనంగా అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయవేత్త, సంఘ సంస్కర్త, అంటరానితనం, కుల నిర్మూలన కోసం అంబేడ్కర్ కృషి చేశారని కొనియాడారు. దయాసాగర్ మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం నేడు ప్రపంచ దేశాలకు మార్గదర్శకమైందన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం- కార్యాచరణ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం స్థానికంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాథ్యూస్, కృష్ణప్రసాద్, బెన్యామెన్, నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి

చేబ్రోలు: భారతదేశం గర్వించదగిన ముద్దుబిడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. అంబేడ్కర్ జయంతిని శుక్రవారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ సమాజంలో ఉన్న రుగ్మతలను రూపుమాపటానికి, దళితులకు ప్రాతినిధ్యం కల్పించడానికి రిజర్వేషన్లు కల్పించిన మహోన్నత వ్యక్తి బీఆర్ అంబేడ్కర్ అన్నారు. పొన్నూరు పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. పొన్నూరు ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఏపీ స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా, దాసరి నారాయణరావు, బొద్దులూరి రంగారావు, కుర్రా పాములు, అనిలా కుమారి, గేరా కుమారి, మోపర్తి ప్రమీల, నూర్ భాషా అల్లా బాషా పాల్గొన్నారు.

వాడవాడలా అంబేడ్కర్ జయంతి

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. యడ్లపాటినగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు యడ్లపాటి రఘునాథబాబు పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. జూగంటి రాంబాబు, సుధాకర్, సతీష్, శివయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేశారు. శేకూరు గ్రామంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, సర్పంచ్ మాతంగి శ్యామల పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ బేతాళ శివయ్య పాల్గొన్నారు. వెల్లలూరు ఎస్సీ కాలనీలో సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి వీఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి

పెదకాకాని: ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి వాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు. పెదకాకాని గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ జరిగింది. సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

చేబ్రోలు: చెరువులోపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ పాల్గొని, మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. యూటీఎఫ్ నాయకులు ఐ.శ్రీనివాసరెడ్డి, జి.వెంకటేశ్వరరావు, ప్రకాష్, హనుమంతరావు, మస్తాన్‌వలి, షర్ఫుద్దీన్, రిటైర్డు హెచ్ఎం గాజులవర్తి సువర్ణకుమార్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి..

కాకుమాను: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీపీ శ్రీనివాసరావు పూల మాలలు వేసి, నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు . అంబేడ్కర్ సూచించిన మార్గంలో విద్యార్థులందరూ నడవాలని కోరారు. సర్పంచ్ శివకుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, కాకుమాను ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, ఉపాధి హామీ ఏపీఓ శింగారావు, సిబ్బంది ఉన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎస్సీ, ఎస్టీ మూడు రాష్ట్రాల డైరెక్టర్ వేముల ఎలీషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నదే అంబేడ్కర్ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులకు రూ.50వేల విలువైన సివిల్ సర్వీస్ పుస్తకాలను అందజేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యూత్ సభ్యుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

మార్గదర్శకుడు అంబేడ్కర్

గుంటూరు రూరల్: ప్రపంచ దేశాలకు మార్గదర్శకమైన రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన గొప్ప వ్యక్తి భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నగర శివారులోని లాంఫాం నందున్న విశ్వవిద్యాలయం పరిపాలన భవన్‌లో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉప కులపతి డాక్టర్ జి.రామారావు, డాక్టర్ పి.సుధాకర్, డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, డాక్టర్ ఎ.మణి, డాక్టర్ సీహెచ్ చిరంజీవి, డాక్టర్ పి.రవి తదితరులు పాల్గొన్నారు. లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ జి.సుబ్బారావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

భారతావని ముద్దుబిడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

గుంటూరు రూరల్: భారతావని ముద్దుబిడ్డ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తెలిపారు. లాలుపురం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. చిన్నపలకలూరు గ్రామంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పెదపలకలూరు గ్రామంలో స్థానిక 40వ డివిజన్ కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేక్ కట్‌చేసి, కార్యక్రమం నిర్వహించారు. నల్లపాడు గ్రామంలో వైఎస్ ఎంపీపీ ఇంటూరి పద్మావతి, కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఇంటూరి అంజిరెడ్డి, మెట్టు వెంకటప్పారెడ్డి, విగ్రహ కమిటీ చైర్మన్ వి.అమరేశ్వరరావు, నడవ వీరయ్య పాల్గొన్నారు. చౌడవరం గ్రామంలో జై భీమ్ వెల్ఫేర్ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అశోక్, ట్రెజరర్ ప్రకాష్, సెక్రటరీ రత్నవిద్యాసాగర్, జాయింట్ సెక్రటరీ జయరాజు పాల్గొన్నారు. జొన్నలగడ్డ గ్రామంలో సర్పంచ్ ముబ్బు శిరీష డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఘన నివాళి

పెదనందిపాడు: ప్రపంచ మేధావి, భారతీయుల ఆరాధ్య దైవం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఏసీటీఓ ఎం.మణికుమార్ అన్నారు. పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకుమాను, పెదనందిపాడు ఏపీఎంలు సోమశేఖర్, ఎం.సుబ్బారావు, పెదనందిపాడు ఎంపీటీసీ-1 సభ్యురాలు మేడిద మాలతి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గేరా మోహన్‌రావు, గేరా రత్తయ్య, గేరా గణేష్, చెల్లి యశోదరావు, కట్టా శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భారత మాత ముద్దు బిడ్డ అంబేడ్కర్

గుంటూరు రూరల్: భారత మాత ముద్దు బిడ్డ డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ అని మాజీ ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్ తెలిపారు. 16డివిజన్ బుడంపాడు అంబేడ్కర్ జయంతి సందర్భంగా.. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. స్థానిక గ్రామ నాయకులు రజినీకుమార్, మీరాజ్ కుమార్, బండారు శ్రీనివాసరావు, ముత్యాల రాజు, ప్రసాద్, బెన్యా మెన్, కోటేశ్వరరావు, మెట్టు వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఏసీటీఓ మణి కుమార్

పేదలకు చీరల పంపిణీ

పెదనందిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా పెదనందిపాడులో ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశిం పీరా ఆధ్వర్యంలో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మేకతోటి దయాసాగర్ పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎంపీపీ టి.హెప్సిబా, వైస్ ఎంపీపీ షేక్ ఖాశింబి, పెదనందిపాడు-1 ఎంపీటీసీ మేడిద మాలతి, సర్పంచ్ దాసరి పద్మారావు, పార్టీ కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, వైస్ సర్పంచ్ దివ్వి రాంబాబు, వైఎస్సార్ సీపీ షోషల్ మీడియా మండల కన్వీనర్ చీమకుర్తి లోకేష్ తదితరులు పాల్గొన్నారు. పెదనందిపాడు-2 సచివాలయంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా విజయవాడ హెల్ప్ హాస్పిటల్, సేవాశక్తి యూత్ సంయుక్త ఆధ్వర్యంలో గుండె సంబంధిత వ్యాధులకు వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజిస్టు జ్వాలా సాయి వైద్య పరీక్షలు చేశారు. వైస్ ఎంపీపీ షేక్ ఖాశింబీ, సర్పంచ్ దాసరి పద్మారావు, ఎంపీటీసీ-1 సభ్యులు మేడిద మాలతి, గేరా గణేష్, యూత్ సభ్యులు గోపి, గొవిందు, సంతుబాబు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న కార్డియాలజిస్టు జ్వాలా సాయి

అభివృద్ధికి మారుపేరు సీఎం వైఎస్ జగన్

గుంటూరు రూరల్(ప్రత్తిపాడు): అభివృద్ధికి మారుపేరు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు మండల కన్వీనర్ గట్టు విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం గనికపూడి గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్, మా భవిష్యత్తు జగనన్నే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామ సర్పంచ్ షేక్ అహ్మద్, ఎంపీటీసీ మదమంచి సురేష్, కట్టా సుబ్బారావు, బాపతు వెంకటరమణ, దాత్రి చెరుమామారావు, ఆనంద్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

కల్తీలేని విత్తనాలు, ఎరువులు అందించడమే లక్ష్యం

మంగళగిరి: రైతులకు కల్తీ లేని విత్తనాలు, ఎరువులను అందించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, మురుగుడు హనుమంతరావు స్పష్టం చేశారు. శుక్రవారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.58లక్షలతో నిర్మించిన వైఎస్సార్ అగ్రిటెస్ట్ ల్యాబ్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులకు కల్తీలేని ఎరువులు, పురుగుమందులు అందించి నాణ్యమైన ఉత్పత్తులను ప్రోత్సహించి మరింత ఆదాయాన్ని కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అగ్రి టెస్ట్ ల్యాబ్ భవనం రూ.58లక్షలతో నిర్మించగా, మరో రూ.67 లక్షలతో అత్యాధునిక వసతులతో రైతులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. కల్తీ విత్తనాలు, ఎరువులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాటికి అడ్డుకట్ట వేసి నాణ్యమైన పంటలు పండించి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం జరుగుతుందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కల్తీ లేకుండా సరఫరా చేసేందుకు ల్యాబ్ ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యవసాయ రంగంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. నియోజకవర్గంలోని రైతులంతా పంటలు వేసే సమయంలో తమ భూములకు భూసార పరీక్షలను వైఎస్సార్ అగ్రి టెస్ట్ ల్యాబ్‌లలో చేయించుకోవచ్చునన్నారు. తొలుత అగ్రిటెస్ట్ ల్యాబ్ ఆవరణలో ఏర్పాటుచేసిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, దుగ్గిరాల మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజి, వ్యవసాయ శాఖ జేడీ నున్నా వెంకటేశ్వర్లు, డీడీ పి రామాంజనేయులు, ఏడీఏ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

చేబ్రోలు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 20 వరకు జరిగే అగ్నిమాపక వారోత్సవాల బ్రోచర్‌ను పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. వారం రోజుల పాటు అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఫైర్ ఆఫీసర్ కొండపల్లి ప్రసాదరావు తెలిపారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ వేసవిలో వారోత్సవాల ద్వారా ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆపద, అత్యవసర సమయాల్లో ప్రాణ నష్టం జరగకుండా ప్రజలను చైతన్యపరచాలని ఎమ్మెల్యే సూచించారు. అగ్నిమాపక సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

20 కేజీల గంజాయి పట్టివేత

పెదకాకాని: విశాఖపట్నం నుంచి అనంతపురానికి తరలిస్తున్న 20 కేజీల గంజాయిని పెదకాకాని పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ నకరికల్లుకు చెందిన పావని రవి అనే వ్యక్తి గాజువాక నుంచి అనంతపురానికి 20 కేజీలు గంజాయిని ఆర్టీసీ బస్సులు తరలిస్తున్నాడు. ఉన్నతాధికారుల సమాచారం మేరకు ఆటోనగర్ వై.జంక్షన్ వద్ద బస్సులను పోలీసులు తనిఖీ చేశారు. రెండు బ్యాగులలో గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అదుపులో తీసుకొని, గంజాయి స్వాధీనపరచుకున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పెదకాకాని : మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ అయిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. మంగళగిరి చెందిన లక్ష్మి శ్రీనివాసరావు దంపతులు ద్విచక్ర వాహనంపై గుంటూరు వైపు వెళ్తుండగా పెదకాకాని వై జంక్షన్ వద్ద వెనక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు లక్ష్మీ మెడలో ఉన్న నల్లపూసలు గొలుసును లాక్కొని పోయారు. బాధితులు పెదకాకాని పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.